RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 78 | పేజీలు : 08 | గురువారం | 26-03-2026 | వెల :4/-

PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



2

## దమ్ముంటే నాపై పోటీకి రావాలి

మళ్లీ సీఎం అవుతానని రేవంత్ కలలు కంటున్నారని హరీశ్ ఎద్దేవా

బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని వ్యాఖ్య

కాంగ్రెస్ పార్టీ అందరినీ మోసం చేసిందని విమర్శ

నియోజకవర్గాల పునర్విభజన వల్ల బీఆర్ఎస్ కే మేలు జరుగుతుందన్న హరీశ్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

2

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

'వందేమాతరం' సర్క్యులర్‌ను సవాలు చేసిన పిటిషన్ కొట్టివేత

ఆదేశాలు కేవలం సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు

ప్రభుత్వ సర్క్యులర్‌లో శిక్షార్హమైన చర్యలు లేవని స్పష్టం చేసిన ధర్మాసనం

పరోక్ష ఒత్తిడి ఉంటుందన్న పిటిషనర్ వాదనలు ఊహాజనితమన్న కోర్టు

దేశభక్తిని బలవంతం చేయలేరని వాదించిన సీనియర్ న్యాయవాది



## అందుకే పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు

ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్ల బోర్డులు వెలిశాయన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో అపోహలు వద్దని ప్రజలకు విజ్ఞప్తి

తెలంగాణలో రెండు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయన్న మంత్రి

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయని, గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాతో ఎలాంటి ఇబ్బందిలేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మవద్దని కోరారు. చమురు

## ఇంధనం నింపుకుంటే చర్యలు తీసుకుంటాం



2

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదన్న మంత్రి ఉత్తమ్

వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం

ప్రజలు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజీల్, వంట గ్యాస్ కొరత ఏర్పడుతోందనే ఆందోళనలపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌కు కొరత లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం కొన్ని బంకులు పెట్రోల్ లేక మూసివేయడంతో జనం

## 40 ఏళ్ల అనుబంధానికి స్వస్తి..

రేవంత్ పై ధ్వజమెత్తుతూ....

కాంగ్రెస్ కు జీవన్ రెడ్డి రాజీనామా



కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా

గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురయ్యానన్న జీవన్ రెడ్డి

2

రాహుల్ విధానాలకు విరుద్ధంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మండిపాటు

తమను ఇబ్బంది పెట్టిన వారికి పెద్దపీట వేస్తున్నారని విమర్శ

ఇకపై తన పోరాటం రేవంత్ విధానాలపైనే అని వెల్లడి



2

## భయపడొద్దు.. ఆ రోజులు పోయాయి

అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం

ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ

మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య

## నిజాయతీ గల నాయకుడు కాదు

దేవాదుల ప్రాజెక్టు కోసం శ్రీహరి చేసింది ఏమీ లేదన్న పల్లా

శ్రీహరికి కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారని వెల్లడి

బినామీ పేర్లతో భారీగా ఆస్తులు కూడబెట్టారని ఆరోపణ

2

హైదరాబాద్ పల్స్,జనగామ

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా



## రాజకీయాలను పక్కనపెట్టి..

భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

సిరిసిల్ల నేతన్నల కోసం మల్లును కలిసిన కేటీఆర్

రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని విన్నపం

పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలన్న కేటీఆర్

సానుకూలంగా స్పందించిన మల్లు భట్టి విక్రమార్క



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ

## ఆ పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారు

ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారని ఆగ్రహం

దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్న

రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమన్న బండి సంజయ్

2



## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...

3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్

2



2

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు

బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ

ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్ నిబంధనలు మార్చారన్న వార్తలను ఖండించిన కేంద్రం

ప్రస్తుత నిబంధనలే కొనసాగుతాయని పెట్రోలియం శాఖ స్పష్టీకరణ

దేశవ్యాప్తంగా తగినన్ని గ్యాస్ నిల్వలు ఉన్నాయని భరోసా

ఆందోళనతో బుకింగ్స్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన

పెట్రోల్, డీజిల్ కొరత లేదని బీపీసీఎల్ ప్రకటన

హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక



# దమ్ముంటే నాపై పోటీకి రావాలి

మొదటి పేజీ రువాయి

కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్ధిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

# అందుకే పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు

మొదటి పేజీ రువాయి

కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడంతో బంకుల్లో రద్దీ నెలకొందని అన్నారు. క్యాన్లు, కంటైనర్లలో ఇంధనాన్ని తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో హాస్టళ్లు, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పని చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఏ బంకును కూడా మూసివేయడానికి అనుమతించలేదని అన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

# 40 ఏళ్ల అనుబంధానికి స్వస్తి..

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని, గౌరవం లేని చోట ఉండలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.పదేళ్ల పాటు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన అసలైన కార్యకర్తలను పక్కన పెట్టి, ఇన్నాళ్లూ తమను ఇబ్బంది పెట్టిన వారికే పెద్దపీట వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన వెన్నంటి ఉన్న కీలక నాయకుడు చనిపోతే సీఎం కనీసం పరామర్శించలేదని, రేవంత్ రెడ్డి తనకు అండగా నిలబడలేదని ఆరోపించారు. ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం ఉంటుందని ప్రకటించారు.మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జీవన్ రెడ్డి తన నిర్ణయానికే కట్టుబడ్డారు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి ఉన్న బలమైన కేడర్ ఇప్పుడు ఆయన వెంటే నడిచే అవకాశం ఉంది.

# ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు

మొదటి పేజీ రువాయి

ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్టు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు.ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఖండించింది.ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

# రాజకీయాలను పక్కనపెట్టి..

మొదటి పేజీ రువాయి

తీసుకున్నారు.సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు.కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# ఆ పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారు

మొదటి పేజీ రువాయి

ప్రాంతీయ అసమానతల పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్నించారు.తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైనట్లుగా ఉందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పారడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కాంగ్రెస్ వారు కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు.

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

మొదటి పేజీ రువాయి

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

# నిజాయతీ గల నాయకుడు కాదు

మొదటి పేజీ రువాయి

రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేసిన పల్లా... దేవాదుల ఎత్తిపోతల పథకం సృష్టికర్తను తానేనని కడియం చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు.2004 నుండి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం శ్రీహరి చేసింది ఏమీ లేదని పల్లా ఆరోపించారు. అప్పట్లో ఎలాంటి పాత్ర పోషించని వ్యక్తి, ఇప్పుడు తానే సృష్టికర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కడియం శ్రీహరికి ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చారని పల్లా గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన విషయాన్ని విస్మరించకూడదన్నారు. కేసీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతోనే ఆయన ఈ స్థాయిలో ఉన్నారని వ్యాఖ్యానించారు.కడియం శ్రీహరి నిజాయతీ గల నాయకుడు కాదని, బినామీ పేర్లతో భారీగా ఆస్తులు కూడబెట్టారని పల్లా సంచలన ఆరోపణలు చేశారు. నైతికత గురించి ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా, సమీకరణలు మారినా తాను జనగామ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తానని, అక్కడి ప్రజలతో తనకున్న అనుబంధం విడదీయలేనిదని పల్లా స్పష్టం చేశారు.

# భయపడొద్దు.. ఆ రోజులు పోయాయి

మొదటి పేజీ రువాయి

వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు.నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

# ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...

మొదటి పేజీ రువాయి

యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే.యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు.అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

# ఇంధనం నింపుకుంటే చర్యలు తీసుకుంటాం

మొదటి పేజీ రువాయి

ఆందోళనకు గురయ్యారు. దీంతో సాయంత్రం నుంచి బంకుల ముందు క్యూ కట్టారు. ఉదయం నుంచి ఇదే పరిస్థితి కనిపించడం, దీనికి తోడు పలు బంకులు మూతపడటంతో ఉత్తమ్ స్పందించారు.తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈరోజు డిమాండ్ 17,246 కిలోలీటర్లు కాగా, 17,898 కిలోలీటర్లు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కారణంగా డిమాండ్ 25 శాతం పెరిగినప్పటికీ, సరఫరా సగటుకు మించి 22 శాతం అధికంగా కొనసాగుతోందని, అదనంగా 16,000 కిలోలీటర్ల బఫర్ స్టాక్ సిద్ధం చేశామని, 1,200 అదనపు ట్యాంకర్లను రంగంలోకి దించామని పేర్కొన్నారు.కొన్ని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపించడం ట్యాంకర్లు ఇంకా చేరుకోనందువల్లేనని, నిజమైన కొరత కారణంగా కాదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చాలాచోట్ల ప్రజలు భయంతో ముందు జాగ్రత్త కోసమని క్యాన్లు, కంటెయినర్లలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడంపై మంత్రి స్పందించారు. ఇలా క్యాన్లలో తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిధిలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా నిర్వహిస్తున్నాయని, ఏ బంకునూ మూసివేయడానికి అనుమతించమని ఆయన స్పష్టం చేశారు.డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లు కూడా పుష్కలంగా ఉన్నాయని, కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కేంద్రంతో మాట్లాడుతున్నామని ఉత్తమ్ తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని గుర్తు చేశారు. స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వులు 60 నుండి 65 రోజులకు సరిపడా ఉన్నాయని, ఓఎన్జీసీ అంతరాయం లేకుండా సరఫరా కొనసాగేలా చూస్తోందని తెలిపారు. కొరత గురించి వస్తున్న అన్ని వదంతులు పూర్తిగా అవాస్తవం అని, అలాంటి ప్రచారాలు విని ప్రజలు ఆందోళన చెందవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## హామీ నెరవేర్చిన సర్పంచ్ - ఉప సర్పంచ్ యువత కోసం గ్రౌండ్ అభివృద్ధి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండల పరిధిలో ఇరవెండి గ్రామపంచాయతీ లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు (ఉప సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షులు) యువత కోసం క్రికెట్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయించారు. గ్రౌండ్ క్లీనింగ్ చేపట్టి, ఆధునిక వైబ్రేటర్ యంత్రంతో సమతలీకరణ పనులు నిర్వహించారు. గ్రామ చరిత్రలోనే తొలిసారిగా ఇలాంటి ఆధునిక పద్ధతులతో గ్రౌండ్‌ను సరిచేయడం విశేషంగా నిలిచింది. యువతకు క్రీడలపై ప్రోత్సాహం కల్పించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీ కృష్ణ, యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ కొనడానికి వెళ్తే మట్టన్ ధర పలుకుతోంది

### సామాన్యుడు కొనలేని పరిస్థితుల్లో చికెన్ ధరలు కొండమీద కూర్చున్న బాయిలర్ కోడి ధర



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లో సామాన్యుడు చికెన్ తినాలంటేనే భయపడుతున్నారు దీనికి కారణం కోడి ధర రికార్డు స్థాయిలో ఆకాశాన్ని అంటుతుంది. స్కిన్ 300 నుండి 320 – స్కిన్ లెస్ 340 నుండి 360 రూపాయల దర పలుకుతుంది. కోడి ధర మార్కెట్లో 220 నుండి 250 వరకు ధర పలుకుతుందని తెలుస్తుంది. కోడి ధర మటన్ ధరతో చేరువలో రోజు రోజుకి ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు కోడిని తినాలన్నా తినలేని పరిస్థితుల్లో పేద ప్రజలు ఉన్నారు. మార్కెట్లో ఇది ఇలాగే కొనసాగితే సామాన్యుల పరిస్థితి ఏమిటి అని, ఆదివారం వస్తే కోడి గుడ్డుకే పరిమితం అవుతుందా అని ప్రజలు అక్కడక్కడ చర్చించుకుంటున్నారు. మార్కెట్లోకి కోళ్లు గతంలో వచ్చినంతగా రావడం లేదని ఎండాకాలం కావడంతో కోళ్లు అక్కడక్కడ రోగాల బారిన పడటం కూడా ఓకింత కావచ్చు, గతంలో కోడిగుడ్లు ఒక ట్రే వచ్చేసి 230 నుండి 250 రూపాయలు ధర పలికినది. నేడు కోడి గుడ్డు ధర తగ్గిన గాని కోడి ధర మాత్రం ఆకాశాన్ని అంటుతుంది.

## ఆర్థిక సహాయాన్ని అందించిన జీఎంర్ ఫౌండేషన్




**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 25 ( నారాయణ ఖేడ్ )**
నారాయణఖేడ్ మండలం నమ్లిమేట్ గ్రామానికి చెందిన బుచ్చి గారి నర్సింలు అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబానికి జీఎంర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుల్లపు మచ్చేందర్ ఆదేశాల మేరకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది ఇందులో జీఎంర్ టీం సభ్యులు నారాయణఖేడ్ మండలం రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నమ్లిమేట్ మాజీ సర్పంచ్ సత్యపాల్ రెడ్డి, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాసంపల్లి అంజన్న, అశోక్, పవన్ రెడ్డి, నరసయ్య,బి ఆర్ యస్ పార్టీ యువ నాయకులు సందీప్,దయానంద్, తదితరులు ఉన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్




**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 25 ( నారాయణ ఖేడ్ )**
నారాయణఖేడ్ నియోజికవర్గం, నాగల్గిద్దా మండలం కారాసగుత్తి గ్రామంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విగ్రహానికి పూలమాల వేసి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సేవా సమితి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగల్గిద్దా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పటేల్, సర్పంచ్ నారాయణ జాదవ్, ఉపసర్పంచ్ అబ్రస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పటేల్, సోపాన్ రావు పటేల్, బాలాజీ పటేల్, దత్తు రెడ్డి, నారాయణఖేడ్ నియోజికవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నందు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కుటుంబాన్ని ఆదుకుంటాం : జిల్లా కలెక్టర్ కె. హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి, జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్.పి. నితికా పంత్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మత్, ఆసిఫాబాద్ ఆర్.డి.ఓ లోకేశ్వర్ రావు,తో తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్ నగర్ కు చెందిన బోయిని నగేష్ అనే మాజీ మావోయిస్టు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజురికి చర్యలు తీసుకుంటామన్నారు. నాగేష్ సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి లావుని పట్టా మంజూరి కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. నగేష్ భార్యను మహిళా సంఘాల గ్రూపులో సభ్యురాలిగా చేర్పించి బ్యాంకు రుణం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.. పదవ తరగతి వరకు చదివి మానేసిన నగేష్ కూతురును, పై చదువులు చదివేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డి. ఆర్. డి. ఓ దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక ఇతర పనులకు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీమాసిఫాబాద్ జిల్లా లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకను ఇతర పనులకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హరీత హెచ్చరించారు. బుధవారం కెరమెరి మండలం అనార్‌పల్లి ఎక్స్‌రోడ్ వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి రసీదులను పరిశీలించారు. ఇసుక ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారో డ్రైవర్లను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు వెంటనే తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇస్తున్న ఇసుకను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## గొంగిడి మహేందర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లోకి బారి చేరికలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదగిరిగుట్ట పట్టణంలోని 2వ వార్డు కు చెందిన సీనియర్ నాయకుడు మోతే నరసింహ నాయకత్వంలో సుమారుగా వంద మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. బిఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం అందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలను మోసపోయామని చాలామంది కాంగ్రెస్ తో పాటు వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు ప్రతి ఒక్కరికి ఆయన పార్టీలోకి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య , పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్ రాజేష్ యాదవ్, నర్సింగం పురుషోత్తం, మోతే బాలు తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారు మోతే నరసింహ, మోతే విజయ్, శ్రీరాములు, తూర్పాటి బాల నరసింహ, తూర్పాటి శంకర్ శంకర్, మిర్యాల నాగార్జున, కళ్యాణ్, దావీద్, సల్ల ప్రవీణ్ మోతే స్వామి, కళ్లెం మల్లేష్ పరశురాం తో కలిసి సుమారు 100 మంది చేరారు..

## బునాదిగాని కాల్వ పూర్తి చేసి చెరువులను నింపాలి : జిల్లా బీజేపీ పార్టీ కౌన్సిల్ మెంబర్ బొబ్బల ఇంద్రారెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ మెంబర్ బొబ్బల ఇంద్రారెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ....ఆత్మకూర్(ఎం) మండలంలో బునాదిగాని కాలువకు శంకుస్థాపన చేసి నేటికీ 20 సంవత్సరాలు అయినా ఇంత వరకు బునాదిగాని కాల్వ పూర్తి కాలేదు ఇప్పటివరకు కాలువ నుండి చుక్కనీరు కూడా చెరువులలోకి వెళ్లలేదు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి తర్వాత బూడిద భిక్షమయ్య గౌడ్ తర్వాత పది సంవత్సరాలు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంలో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూడా ఈ కాల్వని పూర్తి చేయలేదు కానీ నేను బీర్ల ఐలయ్య ను కాను నీళ్ల ఐలయ్య అని చెప్పుకుంటూ రైతులని ప్రజలను మోసం చేస్తూ మాది ప్రజాపాలనని చెప్తూ పుట గడుపుకునే ఎమ్మెల్యే ఈ బునదిగాని కల్వను పూర్తిచేసి నీటిని అందించి అప్పుడు మీరు నీళ్ల ఐలయ్య గా నిరూపించుకోండి అని భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొబ్బల ఇంద్రారెడ్డి అన్నారు.

## ఆసక్తి ఉన్నవారికి మీ ఊరికే వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తాం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట యాదాద్రి భువనగిరి జిల్లాలో కుట్టు మిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు ఫోన్ చేస్తే మీ ఊరికే టీచర్ వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తుందని శ్రీ శక్తి ఇన్స్టిట్యూట్ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాజపేట మహిళ సమైక్య భవనం లో కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఊరిలో ప్రతి ఒక్క మహిళకు నిరుద్యోగ యువతకు కుట్టు మిషన్ నేర్పించాలనేది నా ఆశయం అని ఆకలితో ఉన్నవారికి ఒక పూట అన్నం పెట్టగలం కానీ మనకు వచ్చిన విద్య పంచితే వారికి వారి కుటుంబానికి జీవితకాలం అన్నం పెడుతుందన్నారు. నా వంతు సహాయం ఎంతో కొంత మందికి సేవ చేయనున్నట్లు తెలిపారు. నవనీత నరేందర్ ఫోన్ నెంబర్ 9014514780, 9701679824 కుట్టు మిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు ఈ నెంబర్ కి ఫోన్ చేయండి 15 మంది నుండి 30 మంది ఉంటే మీ ఊరికే టీచర్ వచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజపేట సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నెమల కేదారి, దాచేపల్లి రాజు, నెమల మహేందర్ గౌడ్, గుర్రం నరసింహులు, పాండవుల బసవయ్య, భరత్, మహేష్, నాని, రేగు సిద్ధులు పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న ఉప్పల సిద్ధి లింగం, ఉప్పల రమేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఆర్యవైశ్య సంఘం రాజపేట మండల ప్రధాన కార్యదర్శి రఘునాథపురం పట్టణ అధ్యక్షులు ఉప్పల సిద్ధి లింగం, జిల్లా నాయకులు ఉప్పల రమేష్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోరికలు తీర్చే దేవుడిగా కొనసాగుతున్న శ్రీ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు గోత్రనామార్చనలతో పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఎస్సీ నిరుద్యోగ యువతకు ఏప్రిల్ 2 వరకు దరఖాస్తుల పొడిగింపు

### ఎంపీడీవో నాగవేణి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట నిరుద్యోగులైన షెడ్యూల్డ్ కులముల యువతకు ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2024 - 25 సం. 11 యూనిట్ల మంజూరు నిమిత్తము ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు గాను ఈనెల 24 చివరి తేదీ కాగా, ఇట్టి తేదీని ఏప్రిల్ 2 వరకు పొడిగించుట జరిగినదని ఎంపీడీవో నాగవేణి బుధవారం తెలిపారు. నిరుద్యోగ యువతి, యువకులు ఇట్టి అవకాశమును సద్వినియోగం చేసుకొని ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు, రిజిస్ట్రేషన్ అనంతరం వాటి డాక్యుమెంట్స్ హార్డ్ కాపీ సెట్టును రాజపేట ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో నాగవేణి కోరారు. ఇప్పటివరకు 80 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

# చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు... కలెక్టర్ అనురాగ్ జయంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 16 నుంచి మే 13 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెడికల్ అండ్ హెల్త్, చేనేత శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరాల్లో చేనేత కార్మికులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలతో పాటు వివిధ వ్యాధులపై నిపుణుల ద్వారా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ నిపుణులు, నేత్ర వైద్యులు పాల్గొని కార్మికులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తారని పేర్కొన్నారు. అన్ని మండలాల్లో దశల వారీగా ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు అందించడంతో పాటు, తీవ్రమైన కేసులను రిఫరల్ ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు కూడా ఉంటాయని తెలిపారు. చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు

# చిన్న మేడారం జాతరలో దాడి చేసిన నిందితులు అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలంలోని చిన్న మేడారం జాతరలో ఇటీవల దాడి చేసిన ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ లింగారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...మెగా రోహిత్ అను వ్యక్తి తన కుటుంబంతో జనవరి నెలలో రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో జరిగిన చిన్న మేడారం జాతరకి రాగా అక్కడ కొంత మంది యువకులు రోహిత్ మరియు అతని కుటుంబ సభ్యులతో గోడవకి దిగి కొట్టి గాయపరిచారని పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా రాజాపేట ఎస్ఐ వై. లింగారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాదితుల మెడికల్ సర్టిఫికేట్ రాగా, పాముకుంట, బొందుగుల గ్రామానికి చెందిన రంగా చందు, బొచ్చు సాయి, బత్తిని వర్షిత్, అంబాల సాయి, అనుప పరుశరాములు, ఉప్పరి అజయ్, బోయిని పవన్, పంతం నవీన్, చీర బాలకృష్ణ, దువ్వాల అజయ్ ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టు ముంధు హాజరు పర్చినట్లు తెలిపారు. జడ్జి రిమాండ్ విదించగా ముద్దాయిలను భువనగిరి సబ్ జైల్ కి తరలించడం జరిగినదని ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

# ఐటిసిపిఎస్పిడి అడ్మిన్ బ్లాక్ ఎదుట కార్మిక జేఏసీ నిరసన కార్యక్రమం

### మహా ధర్నా నిరసన కార్యక్రమం చేసిన కార్మిక సంఘాలు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పూర్తి చేయకుండానే 14వ వేతన ఒప్పందానికి శ్రీకారం చుట్టారు. 14వ వేతన ఒప్పందం జరుగుతున్న సందర్భంగా 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలను వెంటనే పూర్తి చేయాలని 14వ వేతన ఒప్పందం రికగ్నైజ్డ్ యూనియన్ వారు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 22 వేల రూపాయలు వేతనం తగ్గకుండా కచ్చితంగా తీసుకురావాలని వారు గతంలోనే చెప్పిన విధంగా లాంగ్ సిక్ అయిన కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగ అవకాశం కల్పించాలని, గత వేతన ఒప్పందంలో రాసిన విధంగా నూతన క్వార్టర్స్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, షటిల్ కోర్టు నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని , కార్మికులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా 100% మెడికల్ సదుపాయం కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం కల్పించాలని, బైక్ స్టాండ్ నిర్మాణం ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితులకు అనుగుణంగా మంచి బైక్ స్టాండ్ నిర్మాణం చేపట్టాలని జేఏసీ కార్మిక నాయకులు భారీ ఎత్తున యావన్మంది కార్మికులతో అడ్మిన్ బ్లాక్ ముందు భారీ ఫ్లెక్సీ తో పెద్ద ఎత్తున నినాదాలు చేపడుతూ యావన్మంది కార్మికుల తరఫున కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయాలని మహా ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగినది. అనంతరం జేఏసీ నాయకులు కాంట్రాక్ట్ కార్మికులు జేఏసీగా ఏర్పడి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా వారి వద్దకు వెళ్లి సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సానికొమ్ము శంకర్ రెడ్డి, కో కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి ,సింగమనేని ప్రసాద్, ఎస్.కె సాబీర్, ఎస్ కే అజీమ్, కోమటిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తన్నీర్ వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# సింగరేణి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి విద్యా కోర్సులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జి.యం.ఆర్. వరలక్ష్మి సెంటర్ ఫర్ ఎంపవర్మెంట్ & లైవ్లీహుడ్స్ సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ అందించనున్నట్లు కొత్తగూడెం ఏరియా జి.యం.ఎం. శాలేం రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృత్తి విద్యా కోర్సులు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రముఖ కంపెనీల సహకారంతో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించబడతాయి. అభ్యర్థులకు ఉచిత వసతి మరియు భోజన సదుపాయం కల్పించబడుతుంది. నిపుణుల ద్వారా సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ బేసిక్ కంప్యూటర్ శిక్షణ అందించబడుతుంది. శిక్షణ పూర్తిచేసిన వారికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. అదనంగా ఉద్యోగ అవకాశాల కల్పనలో కూడా సహకారం అందించబడుతుంది. అర్హత: 18 నుండి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు. శిక్షణా కోర్సులు: డ్రైవాల్ & ఫాల్స్ సీలింగ్ టెక్నిషియన్ వెల్డింగ్ & ఫ్యాబ్రికేషన్ టెక్నిషియన్ ఆటోమొబైల్ & టూ వీలర్ టెక్నిషియన్ గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (హోటల్ మేనేజ్మెంట్) ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ రిఫ్రిజిరేషన్ & ఎయిర్ కండీషనింగ్ (ఆర్ఏసీ) టెక్నిషియన్ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ టెక్నిషియన్ ఎక్స్కవేటర్ ఆపరేటర్ ఈ కోర్సుల్లో చేరదలచిన అభ్యర్థులు కొత్తగూడెం ఏరియా సింగరేణి వి.టి.సి వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.యం.తో పాటు ఎస్.ఓ టు జి.యం. ఎం. వెంకటేశ్వరరావు, కోటి రెడ్డి, ఏజీఎం పర్సనల్ జి.వి. మోహన్‌రావు, జి.ఎం.ఆర్ సంస్థ ప్రతినిధులు ఇతరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ సాగు

### సాగునీరు అందక ఎండుతున్న పంటలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, భద్రాద్రి కొత్త గూడెం :**
చర్ల మండలంలోని దానవాయిపేట గ్రామానికి చెందిన 15 మంది గిరిజన రైతులు తమ పోడు భూముల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో గిరిజన రైతులు 60 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు చేశారు. మొన్నటి వరకు పక్కనే ఉన్న వాగు నుంచి ఇంజన్ల ద్వారా చేలకు సాగు నీరు ఏర్పాటు చేసుకున్నారు. వేసవికాలం రావడంతో వాగులో ఉన్న నీరు ఒక్క సారి గా ఇంకి పోవడంతో రైతులకు కష్టకాలం వచ్చింది. తమ చేలో వ్యవసాయ బోరు బావులు నిర్మించినా విద్యుత్ సౌకర్యం లేక వ్యవసాయ బోర్లు ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటిసి ఆధ్వర్యంలో నిర్మించిన నీటి కుంటలు సైతం ఎండి పోయాయని చూస్తూ చూస్తూ పంటను ఎండ బెట్టలేక ట్యాంకర్ల ద్వారా పంట చేలకు సాగు నీరు పెట్టుకుంటున్నామని తద్వారా రోజు, రోజుకు ఖర్చులు అధిఖం అవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. చింతగుప్ప నుంచి కేవలం కిలో మీటర్ దూరం లో ఉన్న తమ చేలకు ప్రధాన లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తే తమ కష్టాలు తీరుతాయని తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకుని తమకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు



# ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి

### మాజీ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జన్నాయికోడే నగేష్ డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఆత్మకూర్ (ఎం) మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు జన్నాయికోడె నగేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ఎలాంటి పదవి లేకున్న కరోనా సమయంలో ప్రతి గ్రామంలో ప్రజలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు, మాస్కులు, తాగునీరు, అంబులెన్స్ సౌకర్యం అందించారని గుర్తుచేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు అనాటి ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యురాలు శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ని వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి తమ గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరితే లేదు అని మీరు గ్రామ పంచాయతీ తీర్మాణం ఇచ్చిన ఇవ్వకున్న తమ బిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు పనులు ఇస్తామని అవమానించారన్నారు. తీర్మానాలు ఇచ్చిన అన్ని చోట్ల పనులు చెయ్యని దద్దమ్మ లు మీరు ఇప్పుడు నిధులు ఇవ్వడం లేదు అనడం సిగ్గు చేటు అని వారు అన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యే గా గెలిచాక ఆత్మకూరు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు ఉన్న గ్రామాలకు గణనీయంగా అభివృద్ధి నిధులు మంజూరు చేశారు. ఆత్మకూరు టౌన్ కి 3 కోట్ల 50 లక్షలు, పల్లెపహాడ్ 80 లక్షలు, రాఘవపురం 30 లక్షలు, పుల్లాయిగూడెం 30 లక్షలు, రహీంఖాన్‌పేట 40 లక్షలు, ఖప్రాయిపల్లి 40 లక్షలు, తుక్కాపురం 40 లక్షలు, మొదుగుబావిగూడెం 10 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం గెలిచిన బిఆర్ఎస్ సర్పంచులు నోరు అదుపులో పెట్టుకొని ఆత్మ పరిశీలన చేసుకొని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తో కలిసి గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అంకితభావంతో పనిచేయాలని పని కట్టుగొని వ్యక్తి గత విమర్శలు చేస్తే మా నాయకులు కార్యకర్తలు తగిన గుణపాఠం చెపుతారు అని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు పరస్పరం గౌరవంతో వ్యవహరించి, గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుబ్బురు వెంకటేశ్వర్లు, దయ్యాల రాజు, కొమిరెల్లి రాంరెడ్డి, సుంకిశాల ఎల్లయ్య, జామ యాదయ్య, ఎర్ర గీత మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చిట్కుల్ లో శాస్త్రోక్తంగా శ్రీ సీత రామ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం





**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25 :** ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో నిర్మించిన శ్రీ హనుమ సమేత సీతా రామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నులపండువగా ముగిసింది. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా, బుధవారం తెల్లవారుజాము నుండే వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9:43 గంటలకు మృగశిర నక్షత్ర యుక్త వృషభ లగ్న సుముహూర్తాన స్వామి వారి యంత్ర స్థాపన, బింబ స్థాపన, శిఖర స్థాపన ఘట్టాలను అత్యంత వైభవంగా పూర్తి చేశారు. అనంతరం మూర్తులకు ప్రాణ ప్రతిష్ఠ గావించి, నేత్రోన్మీలనము నిర్వహించారు. ఆలయ నిర్మాణంతో పాటు కాలనీలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు నీలం మధు ముదిరాజ్ తీసుకున్న ఈ చొరవను కాలనీ వాసులు కొనియాడుతున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మూర్తులకు ప్రత్యేక కళా కుంభాభిషేకము, శ్రీ సీతారామ స్వామి దేవతా అర్చనలు నిర్వహించారు. మహానివేదన, మంగళ నీరాజనాల అనంతరం భక్తులకు రక్షాధారణ, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామనామ స్మరణతో చిట్కుల్ పుర వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, భక్తులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**క్యాసారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి 15 లక్షల రూపాయల భారీ విరాళం.**
**జయ జయ ధ్వనాల మధ్య విగ్రహ ప్రతిష్టాపన**
**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25 :** పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో మారు తన దైవభక్తిని చాటుకున్నారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తూ సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు. చర్చిల నిర్మాణానికి సొంత నిధులు కేటాయిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పటాన్చెరు మండలం క్యాసారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం నిర్మాణానికి 15 లక్షల రూపాయల సొంత నిధులు అందించి తన భక్తి భావాన్ని చాటుకున్నారు. బుధవారం నిర్వహించిన స్వామివార్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథరెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# కాగజ్ నగర్ లో భరోసా మరియు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**బాలికలు మరియు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం.**






**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్తు సెకండరీ హై స్కూల్, కాగజ్ నగర్ లో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి భరోసా సెంటర్ ఇన్చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులకు గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి మరియు ఫోక్సో యాక్ట్ ల గురించి వివరించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 112 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సమస్యలకు గురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 కు భరోసా నెంబర్ 8712670561 వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రోజా రమణి, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, సునీత, భరోసా సభ్యులు శైలజ అడ్వొకేట్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# భారత్.. పాకిస్థాన్ లా 'బ్రోకర్' కాదు.. ఇచ్చిపడేసిన జై శంకర్..





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, ఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. చర్చలు అంటూనే ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ పై దాడులకు పాల్పడుతోంది అమెరికా. ఇరాన్ సైతం ప్రతీకార దాడులు చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్- అమెరికా మధ్య సంధి చర్చలను ప్రారంభించేందుకు పాకిస్థాన్ రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. అయితే ఇరాన్- అమెరికా మధ్య పాకిస్థాన్ వైఖరిపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్.. పాకిస్థాన్ లాగా 'బ్రోకర్' పాత్ర పోషించదని స్పష్టం చేశారు. తాజాగా జరిగిన అఖిలపక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా పాకిస్తాన్, టర్కీ వంటి పలు దేశాలు మధ్యవర్తిత్వానికి నిలిచిన నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 1981 నుండి అమెరికా.. పాకిస్థాన్ ను ఉపయోగించుకుంటోంది.. కాబట్టి పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొత్తేమీ కాదని జైశంకర్ అన్నట్లు పీటీఐ వర్గాలు తెలిపాయి. మధ్యప్రాచ్య సంక్షోభంపై తాజాగా అఖిలపక్ష సమావేశం జరిగింది. పశ్చిమాసియా యుద్ధం అన్ని పక్షాలను ప్రభావితం చేస్తున్నందున అది త్వరగా ముగించాలని ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు చెప్పారని ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులకు వివరించింది. ఉద్రిక్తతలను తగ్గించే వైఖరిని భారత్ పునరుద్ఘాటించింది. సంక్షోభంపై దిల్లీ మౌనంగా ఉందన్న ప్రతిపక్ష విమర్శలను ఖండించిన ప్రభుత్వం.. "మేము మాట్లాడుతున్నాము.. స్పందిస్తున్నాము" అని బదులిచ్చింది. ఇరాన్ రాయబార కార్యాలయం ప్రారంభమైనప్పుడు విదేశాంగ కార్యదర్శి తక్షణమే సందర్శించి సంతాప పుస్తకంలో సంతకం చేసి, ఆలస్యమైన ప్రతిస్పందన ఆరోపణలను ఖండిస్తూ దౌత్యపరమైన కృషిని ప్రస్తావించారు. గల్ఫ్ ప్రాంతంలోని భారతీయు భద్రత, దేశీయ ఇంధన భద్రతే తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం నొక్కి చెప్పిందని పీటీఐ వర్గాలు తెలిపాయి. మారుతున్న పరిస్థితుల మధ్య కూడా ఈ రెండు లక్ష్యాలను ఇప్పటివరకు సమర్థవంతంగా నిర్వహించగలిగామని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ ప్రతిస్పందనలు "అసంతృప్తికరంగా" ఉన్నాయని ప్రతిపక్షం అభివర్ణించి, పార్లమెంటులో వివరణాత్మక చర్చకు పట్టుబట్టింది. కాంగ్రెస్ నాయకుడు తారిక్ అన్వర్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ.. పాకిస్తాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తుంటే "మనం ఇప్పటికీ మౌనంగా చూస్తున్నాము" అని అన్నారు. లోక్‌సభలో నియమం 193, రాజ్యసభలో నియమం 176 కింద చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ నుండి రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు కూడా పాల్గొన్నారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. హాజరైన ప్రతిపక్ష నాయకులలో కాంగ్రెస్ నుండి తారిక్ అన్వర్, ముకుల్ వాస్నిక్, సమాజ్‌వాదీ పార్టీ నుండి ధర్మేంద్ర యాదవ్, బీజేడీ నుండి సస్మిత్ పాత్ర ఉన్నారు.

# శ్రీరామనవమి సందర్భంగా పూర్వ విద్యార్థుల అన్న ప్రసాద వితరణ

**కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరిన 2005 - 06 ఎస్ఎస్సి విద్యార్థులు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన 2005 – 06 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు శ్రీరామనవమి సందర్భంగా అందిస్తున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనాలని సోషల్ మీడియా ద్వారా కోరారు. బుధవారం వారు వివరాలు చెబుతూ రాజపేటకు చెందిన 2005 – 06 ఎస్ఎస్సి విద్యార్థులు అందరూ కలసి ఈనెల 27వ తేదీన రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం అనంతరం పాల్గొన్న భక్తులకు ప్రజలకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 500 మంది భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవం అన్న ప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# పూర్తి ఇంటి పన్నులు చెల్లించిన రాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గం బుధవారం తమ పూర్తి ఇంటి పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. ఇంటి పన్ను రసీదులను పంచాయతీ కార్యదర్శి సాయిలు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి కోయ మధు ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్ ఇతర వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పనులు పూర్తిగా చెల్లించి సహకరించాలని జిల్లాలోనే రాజపేటను ఆదర్శంగా నిలపాలని కోరారు. పాలకవర్గం మొత్తం 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నును పూర్తిగా చెల్లించాలని చెప్పారు.

# గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్న శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ


## గ్యాస్ సిలిండర్లను ఆంధ్రాలో అధిక రేట్లకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** ప్రజలకు అందాల్సిన డొమెస్టిక్ సిలిండర్లు హోటళ్ళకు మళ్లింపు నామ మాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్న అధికారులు. గ్యాస్ బుక్ చేసుకుని పది రోజులు దాటుతున్న గ్యాస్ సెకండర్లు ఇవ్వట్లేదని వాపోతున్న కస్టమర్లు బూర్గంపహాడ్ మండలం సారపాక లో ఉన్నటువంటి శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ లో డొమెస్టిక్ సిలిండర్లు గృహ వినియోగాలకు కాకుండా బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్టుగా వినియోగదారులు ఆరోపణలు చేస్తున్నారు. తెలంగాణ స్థానికులకు గ్యాస్ లేకపోయినా పర్వాలేదు ఆంధ్ర కస్టమర్లకు మాత్రం యాజమాన్యానికి కూడా తెలవకుండా గ్యాస్ గోడౌన్ లో విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి తన ఇష్టానుసారంగా గుట్టు చప్పుడు కాకుండా గ్యాస్ సిలిండర్లను బయటకు తరలిస్తున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా సర్పంచ్ల పోరం ప్రచార కార్యదర్శిగా నియమితులైన సర్పంచ్ భూక్యా రాజారామ్ నాయక్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరమ్ ప్రచార కార్యదర్శి గా నూతనంగా ఎన్నోకోబడిన సర్పంచ్ల పోరంలో తుర్కపల్లి మండలంలోని చోక్ల తండా సర్పంచ్ భూక్య రాజారామ్ నాయక్ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులయరు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నా నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కి సర్పంచ్ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధని భూమన్న కి, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ అనునిత్యం సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషీ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనావత్ శంకర్ నాయక్, తుర్కపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చాడ భాస్కర్ రెడ్డి, రుస్తాపూర్ తాజా మాజీ ఎంపీటీసీ ధనావత్ మోహన్ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుండు నరసింహ గౌడ్ కు ఎస్ఎల్ఎన్ఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదగిరిగుట్ట ఎస్ఎల్ఎన్ఎస్ ఆటో యూనియన్ అధ్యక్షులు గుండు సాయిలు గౌడ్ ఎస్ఎల్ఎన్ఎస్ ఆటో యూనియన్ అధ్యక్షులు రాంపల్లి రజనీకాంత్ ల ఆధ్వర్యంలో మా మిత్రుడు గుండు నరసింహ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని బుధవారం ఘనంగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా మా ఆటో యూనియన్ నుండి పై స్థాయికి వెళ్లడానికి కృషిచేసిన ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి కృతజ్ఞతలు తెలుపుతున్నం మా ఆటో కార్మికుల పై మీరు చూపిస్తున్న ప్రేమని మేము ఎన్నడు మరువలేం మీకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్న అని బీర్ల ఐలయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుండు సాయిల్ గౌడ్, రాంపల్లి రజనీకాంత్ గౌడ్, మోహన్ నాయక్, కంసాని శ్రీహరి, జమాల్, ఎల్లా గౌడ్, రజినీకాంత్, చాంద్ పాషా, సత్యం గౌడ్, మంగు నాయక్, జహంగీర్, గుండు మధు, సాయి, కందుకూరు మధు, వాటర్ మధు, నగేష్ తదితర ఆటో డ్రైవర్స్ పాల్గొనడం జరిగింది.

# మమ్మల్ని అడ్డుకునేది ఎవరు అంటున్న ఇసుక దళారులు...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని కొరటికల్ బిక్కేరు వాగు నుండి ఉదయం 6 గంటల నుంచే భారీగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం, లేదా వారి అండతోనే ఈ దందా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పక్కనబెట్టి ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తూ, "మమ్మల్ని అడ్డుకునేది ఎవరు?" అంటూ ఇసుక దళారులు సవాల్ విసురుతున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం నష్టం కలుగుతుండగా, వాగు పరిసరాలు కూడా దెబ్బతింటున్నాయి. ఈ అక్రమ రవాణాపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధి హామీ పని దినములను 200 రోజులకు పెంచాలి

**ఉపాధి హామీ కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం అచ్చెల్లి గ్రామ శివారులోని పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం కార్మికుల పని ప్రదేశాన్ని సిఐటియు నాయకత్వం సందర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ ఉపాధి కూలీలు పని ప్రదేశంలో తమ ప్రాణాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్నారని ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స కిట్లు, మంచినీటి సౌకర్యం కూడా లేవని అన్నారు. ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ స్కీమును విస్తరించి పని రోజులను 200 లకు పెంచాలనీ, కేరళ రాష్ట్ర ఎర్రజెండా ప్రభుత్వం తరహా రోజుకు రూ.800/- లు కనీస కూలీ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బకాయి కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి. జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలి. కూలీలకు పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలి దెబ్బలు తగిలిన వారికి ప్రథమ చికిత్స జరిపే విధంగా ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలి ఎండలకు వడ దెబ్బలకు గురి కాకుండా కాసేపు సేద తీర్చుకోవడానికి టెంట్ వేయాలని ఇవన్నీ కూలీలు ప్రమాదాలకు గురి కాక ముందే పై స్థాయి అధికారులు తక్షణమే ఏర్పాటు చేయాలని, జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డులు వెంటనే ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ వీబి-జీ-రాం-జీ పథకం పేరుతో కేంద్రం నుంచి ఇవ్వాల్సిన 90 శాతం నిధులను రద్దు చేస్తు 60 శాతానికి కుదింపు తీరును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేసే ఆందోళన కార్యక్రమాల్లో ఉపాధి కూలీలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# శ్రీరామనవమికి సీతారామ క్షేత్రం సుందరంగా ముస్తాబు


**రాములవారి కళ్యాణానికి సర్వం సిద్ధం**

**హాజరుకానున్న పీఠాధిపతులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, ఝరాసంగం:** ప్రకృతి రమణీయత మధ్య ఆకుపచ్చని అటవీ ప్రాంతంలో వెలసిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ఏడాకులపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈనెల 27న సందర్భంగా భక్తులతో కిటకిటలాడనుంది. దేవస్థానానికి వచ్చే భక్తుల కోసం భారీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు పల్లకి సేవను ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాతం, తోమాల సేవ, నిత్యార్చనలు, హోమాలు, హరినామ సంకీర్తనలు, అన్నదానం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 1008 మహామండలేశ్వరులు సిద్దేశ్వరానందగిరి మహరాజ్, తంగేడు పల్లి కోటి లింగేశ్వర మఠం పీఠాధిపతి 108 శివయోగి శివచార్య మహాస్వామి, కుప్పా నగర్ -చిలేపల్లి మల్లన్న గట్టు ఆశ్రమ పీఠాధిపతి బసవలింగ అవధూత హాజరుకానున్నట్లు తెలిపారు. శ్రీరాముని భక్తులు, హిందూ బంధువులందరూ ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# పోషకాహారం, పరిశుభ్రతపై రాజీ లేదు: జాతీయ మానవ హక్కుల కమిషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 25, సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి స్థాయి వసతి సౌకర్యాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వసతి గృహాల్లోని మౌలిక వసతులు, బోధన ప్రమాణాలు, పరిశుభ్రత, భద్రత, భోజన నాణ్యత అన్నీ మెరుగ్గా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూములు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, శిధిలావస్థలో ఉన్న భవనాలను తక్షణమే మరమ్మతు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సమయానికి పౌష్టికాహారం అందుతున్నదీ, పర్యవేక్షణ సక్రమంగా జరుగుతున్నదీ పరిశీలించారు. అదేవిధంగా పోక్సో కేసులు, మానవ అక్రమ రవాణా నివారణ, నేరాల నియంత్రణపై పోలీస్ అధికారులతో, భూ నిర్వహణ చట్టాల అమలు, మధ్యాహ్న భోజన బియ్యం సరఫరాపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. విద్యార్థులకు మెరుగైన వసతి, భద్రత, పోషకాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి, ఆర్.డి.ఓ, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.


# నకిలీ ఐస్ క్రీమ్ పరిశ్రమపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు..ఇద్దరి అరెస్ట్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, రాజేంద్రనగర్:** నకిలీ ఐస్ క్రీమ్ పరిశ్రమపై టాస్క్ ఫోర్స్ పోలీసులు అత్తాపూర్ పోలీసులతో కలిసి మెరుపు దాడులు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఐస్ క్రీమ్‌కు కలర్లు, క్రీములు పూసి నకిలీ ఐస్ క్రీములు తయారు చేస్తున్న కేంద్రంపై పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలో జై భోలేనాథ్ ఐస్ క్రీమ్ పేరుతో రతన్ లాల్ చౌదరి , అతని సోదరుడు భవర్ లాల్ చౌదరిలు పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మరో వ్యక్తికి చెందిన పేరు గాంచిన జై బోలేనాథ్ ఐస్ క్రీమ్ పేరును కాపీ చేసి వాడుకుంటున్నారు. ప్రమాదకరమైన సింథటిక్ రంగులు, రసాయనాలు, నాణ్యత లేని ముడిసరుకును ఐస్ క్రీమ్ తయారీలో ఉపయోగిస్తున్నారు. రకరకాల ఫ్లేవర్ డ్రింక్స్ ను అపరిశుభ్ర నీటిలో పోసి నాసిరకం ఐస్ క్రీమ్‌లను తయారు చేస్తున్నారు. రుచికరమైన ఐస్ క్రీం పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తూ.. అమాయకులను మోసం చేస్తున్నారు. కాగా పరిశ్రమలోని ముడి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేశారు. ప్రజలు ఐస్ క్రీమ్ కొనేముందు బ్రాండ్, నాణ్యతను తనిఖీ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# నకిలీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా గుట్టురట్టు..

**70 క్వింటాళ్ల కల్తీ పేస్ట్, ప్రమాదకర రసాయనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, రాజేంద్రనగర్:** నిబంధనలకు విరుద్ధంగా, అపరిశుభ్ర వాతావరణంలో రసాయనాలను ఉపయోగిస్తూ కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. బుధవారం హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, ఫుడ్ అడల్టరేషన్ (ఆహార కల్తీ నియంత్రణ) విభాగం అధికారులతో కలిసి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.ఎం. పహాడీలోని "డెక్కన్ ట్రేడర్స్" గోడౌన్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న సోహైల్ చరానియా (38), రహీమ్ చరానియా (36), అమిత్ చరానియా (35) లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ప్రమాదకరమైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి..**

నిందితులు ముగ్గురు కలిసి ఎం.ఎం. పహాడీలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో గోడౌన్లను నడుపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేందుకు శాంటిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్, వెల్లుల్లి పొట్టును కలిపి నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారు. పేస్ట్ తయారీని అత్యంత అపరిశుభ్రంగా, ఈగలు, దుమ్ము ధూళి మధ్య చేస్తున్నారు. తయారు చేసిన ప్రమాదకరమైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి, నగరంలోని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిందితుల నుంచి 70 క్వింటాళ్లు అల్లం వెల్లుల్లి పేస్ట్, 1 బాక్స్సింథటిక్ ఫుడ్ కలర్ ప్యాకెట్లు, శాంటిక్ యాసిడ్ టిన్ (40 లీటర్లు), ఆదిత్య బిర్లా కెమికల్స్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. యదేందర్, సిబ్బంది అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భజన మండలి గౌరవాధ్యక్షుడి కి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన వెంకటేశ్వర భజన మండలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు భజన మండలి గౌరవాధ్యక్షులు వల్లకాటి బాబురావు జ్యోతి పుణ్య దంపతులు పెళ్లి రోజు సందర్భంగా బుధవారం వెంకటేశ్వర భజన మండలి భక్త బృందం వారి స్వగృహంలో చేనేత శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు బితోజు వెంకటేశం, కటకం సంతోష్, ఉపేందర్, నాగేష్, వెంకటేష్, బాల సిద్దులు, శ్రీనివాస్, భాస్కర్, నాగభూషణం, వివేక్, హరినాథ్, ఆత్మలింగం, రామచంద్రం, తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు

## వందేమాతరం ఆలపిస్తుండగా వాకౌట్.. ఎంఐఎం ఎమ్మెల్యేల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి : బీజేపీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, మెయిన్ డెస్క్ :**

తెలంగాణ శాసనసభలో జాతీయ గీతం 'వందేమాతరం' ఆలాపన జరుగుతుండగా వాకౌట్ చేసిన ఎంఐఎం ఎమ్మెల్యేల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్నప్పుడు ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడం అంటే దేశాన్ని, జాతీయ గీతాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమే అని అన్నారు. మజ్లిస్ నాయకులకు "భారత్ మాతా కీ జై" అనడం రాదు, "జై హింద్" అనడం రాదు కానీ, "జై పాలస్తీనా" అనడం మాత్రం వచ్చు అంటూ ఎద్దేవా చేశారు. వందేమాతరం గీతాలాపన సమయంలో సభ నుంచి వాకౌట్ చేయడం అంటే కేవలం సభా నిబంధనలను ఉల్లంఘించడం మాత్రమే కాదని, జాతీయ గీతానికి, దేశానికి జరిగిన తీరని అవమానంగా భావించాలని అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉండి, జాతీయ చిహ్నాల పట్ల కనీస గౌరవం లేని ఎంఐఎం సభ్యుల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది వారి సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. సభ గౌరవాన్ని, జాతీయ గీత ప్రతిష్టను దిగజార్చిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ గౌరవం కంటే ఏ రాజకీయ పార్టీ లేదా మతం ముఖ్యం కాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే ఏకైక మార్గమని రాంచందర్ రావు అన్నారు.

## నేడు రాజపేటలో తైబజారు వేలం పాట

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే సంత తైబజారు వేలంపాట ఈనెల 26వ తేదీ గురువారం జరగనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి మహాత్మా గాంధీ విగ్రహం కూడలి వద్ద ఉదయం 11 గంటలకు వేలంపాట జరగనుందని, వేలంపాటలో పాల్గొనేవారు ఉదయం 10 గంటల వరకు పదివేల రూపాయల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పంచాయతీ పొందుపరిచిన నిబంధనలకు లోబడి వసూలు నిర్వహణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సర్పంచి కోయ మధు అధ్యక్షతన ఉపసర్పంచి వార్డు సభ్యుల, గ్రామ పెద్దల సమక్షంలో వేలంపాట ఉంటుందన్నారు. వేలంపాటలో దక్కించుకున్న వారికి సంవత్సర కాలం పాటు హక్కులు ఉంటాయని చెప్పారు.

# భద్రాచలం నేతాజీ హాస్పిటల్ లో దారుణ ఘటన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాచలంలోని నేతాజీ హాస్పిటల్ లో 17 నెలల చిన్నారికి హర్నియా ఆపరేషన్ పేరుతో అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్ ఇవ్వడం వల్ల బాలుడు కోమాలోకి వెళ్లినట్లు సమాచారం. అనంతరం బాలుడిని విజయవాడకు తరలించినప్పటికీ, బ్రెయిన్‌కు సరైన ఆక్సిజన్ అందకపోవడంతో పరిస్థితి మరింత విషమించి, చివరికి బాలుడు మృతి చెందినట్లు తెలిసింది. తల్లిదండ్రుల ఆరోపణల ప్రకారం: అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్ ఇవ్వడం జరిగింది. సమయానికి సరైన చికిత్స అందించలేదు బ్రెయిన్‌కు ఆక్సిజన్ అందకపోవడం వల్ల కోమా పరిస్థితి ఏర్పడింది విజయవాడలో కూడా సరైన వైద్యం అందించలేదని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులూ




ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి, నిజానిజాలు వెలికితీయాలి. నిర్లక్ష్యం చేసిన వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## మహాదేవ్ యాప్ కేసులో ఈడీ దూకుడు.. బుర్జ్ ఖలీఫాలోని ఫ్లాట్లు, దుబాయ్‌లో ఆస్తులు జప్తు



న్యూఢిల్లీ: మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడుగా వ్యవహరిస్తున్నది. ఈ కేసులో చురుగ్గా దర్యాప్తు చేస్తున్నది. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాలో పలు ఫ్లాట్లతో సహా 20 స్థిరాస్తులను జప్తు చేసింది. ఈడీ కొత్తగా అటాచ్ చేసిన ఆస్తులలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనమైన దుబాయ్‌లోని ప్రతిష్టాత్మక బుర్జ్ ఖలీఫాలోని పలు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు దుబాయ్ హిల్స్ ఎస్టేట్‌లోని కొన్ని విలాసవంతమైన విల్లాలు, ఫ్లాట్లు, బిజినెస్ బే వాణిజ్య జిల్లా, ఎస్ఎల్ఎస్ హోటల్, రెసిడెన్సెస్ లగ్జరీ టవర్‌లోని పలు ఖరీదైన ఫ్లాట్లతో సహా 18 ఆస్తులను ఈడీ జప్తు చేసింది. కాగా, వీటితోపాటు ఢిల్లీలోని రెండు స్థిరాస్తులను కూడా జప్తు చేసినట్లు ఈడీ అధికారి తెలిపారు. కొత్తగా అటాచ్ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 1,700 కోట్లు అని చెప్పారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ ప్రధాన ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రకర్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులని వెల్లడించారు. మరోవైపు మహాదేవ్ ఆన్‌లైన్ బుక్ ప్లాట్‌ఫామ్, ఇతర సంస్థల పేరిట జరిగిన అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన నేరం ద్వారా వచ్చిన ఆదాయంతో ఈ ఆస్తులను నిందితులు కొనుగోలు చేసినట్లు ఈడీ పేర్కొంది. దర్యాప్తులో ఇది వెల్లడి కావడంతో సంబంధిత ఆస్తులను అటాచ్ చేసినట్లు వివరించింది.

# అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు!

### ఎల్.హెచ్.పి.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ నాయక్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 25, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువంగిరి జిల్లా, బొమ్మలరామారం మండల కేంద్రం నుండి అసెంబ్లీ ముట్టడి కోసం బుధవారం వెల్తున్న మమ్మలను అక్రమాంగ అరెస్టు చేసారానీ బొమ్మలరామారం మండల ఎల్.హెచ్.పి.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు.....తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనులను తీవ్ర అన్యాయానికి నిరసనగా, కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టులో ఎస్.టి డిక్లరేషన్ ను అమలు చేయాలని, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహం మరియు మందిరము రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించి నిర్మించలని, లంబాడిలకు క్యాబినెట్లో స్టానం కల్పించలనీ తాండలను రెవెన్యు గ్రామ పంచాయతీలుగా ప్రకటించలాని, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పెరు పైనా, హైదరాబాద్ లోని యూనివర్సిటీనీ నిర్మించాలనీ, సేవాలాల్ జయంతినీ ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకాటించలాని, అసెంబ్లీ ముట్టడి కోసం వెల్తున్న మమ్మలను అక్రమాంగా అరెస్టు అయినవారు. ఎల్.హెచ్.పి.ఎస్. మండల అధ్యక్షులూ కృష్ణ నాయక్ (తిమ్మాపూర్ సర్పంచ్ ), ఎల్.హెచ్.పి.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ నాయక్, ఉపాఅధ్యక్షులు భాస్కర్ నాయక్ యువజన విభాగం అధ్యక్షులు పరమేశ్ నాయక్, ఎల్.హెచ్.పి.ఎస్. ప్రధాన కార్యదర్శి స్వామి (వార్డు సభ్యులు) లను ముశీధస్థుగా అరెస్టు చెసి, బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ కు తరిలించారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మలోత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు సేవాలాల్ విగ్రహం హైదరాబాదులో నిర్మించే వరకు మా పోరాటం ఆగదు, సేవాలాల్ మహారాజ్ జయంతినీ ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకాటించలాని డిమాండ్ చెసారు.



# పాకిస్తాన్‌కు ఇరాన్ బిగ్ షాక్.. నో పర్మిషన్..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25 :**
అంతర్జాతీయ వేదికపై ఇరాన్-అమెరికా మధ్య రాయబారం నడిపి 'హీరో' అనిపించుకోవాలనుకున్న పాకిస్తాన్ ఆశలపై ఇరాన్ చన్నీళ్లు చల్లింది. ఒకవైపు చర్చలకు ఆతిథ్యం ఇస్తామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదనలు చేస్తుంటే, మరోవైపు పాకిస్తాన్‌కు వస్తున్న సరుకు రవాణా నౌకను ఇరాన్ దళాలు అడ్డుకొని వెనక్కి పంపడం గమనార్హం. ఈ పరిణామం దౌత్యపరంగా పాకిస్తాన్‌కు పెద్ద అవమానంగా భావిస్తున్నారు. పంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదో వంతు వాటా కలిగిన అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి' ఇప్పుడు ఇరాన్ కంచుకోటగా మారుతోంది. అంతర్జాతీయంగా స్వేచ్ఛా వాణిజ్య మార్గంగా గుర్తింపు పొందిన ఈ జలసంధిలో.. ఇకపై తన అనుమతి లేనిదే అడుగు పెట్టడం సాధ్యం కాదన్నట్లుగా ఇరాన్ వ్యవహరిస్తోంది. తాజాగా మార్చి 25న (బుధవారం) షార్జా నుంచి పాకిస్థాన్‌లోని కరాచీకి బయలుదేరిన 'సెలెన్' అనే కంటైనర్ నౌకను ఇరాన్ దళాలు అడ్డుకొని వెనక్కి పంపడం సంచలనంగా మారింది.

**నౌకను వెనక్కి పంపిన ఐ.ఆర్.జి.సి.. కారణం ఇదే!**

సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ జెండాతో ప్రయాణిస్తున్న 'సెలెన్' నౌకను ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నిలిపివేసింది. ఈ చర్యపై రియర్ అడ్మిరల్ అలీరెజా తంగ్సిరి స్పందిస్తూ.. "చట్టపరమైన నిబంధనలను పాటించనందున, ముందస్తు అనుమతి లేనందున ఆ నౌకను వెనక్కి పంపాము. ఇకపై ఈ మార్గంలో ప్రయాణించే నౌకలు మా సముద్ర అధికారులతో ఖచ్చితంగా సమన్వయం చేసుకోవాలి" అని తేల్చి చెప్పారు. అంటే, అంతర్జాతీయ హామీ ఉన్న ఈ మార్గం ఇప్పుడు ఇరాన్ 'అనుమతి ఆధారిత కారిడార్'గా మారిపోయిందని స్పష్టమవుతోంది.

**దౌత్య ప్రయత్నాలకు చుక్కెదురు!**

ఈ ఉద్రిక్తతల మధ్యే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒక కీలక ప్రతిపాదన చేశారు. ఇరాన్-అమెరికా మధ్య చర్చలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పంచుకున్నప్పటికీ, వాషింగ్టన్ తన అధికారిక భాగస్వామ్యాన్ని ఇంకా ధృవీకరించలేదు. మరోవైపు ఇరాన్ మాత్రం చర్చలకు తమకు ఆసక్తి లేదని, సంఘర్షణ కొనసాగిస్తామని మొండిగా సమాధానమివ్వడం గమనార్హం.



# ఉగ్రకుట్ర కేసు.. హైదరాబాద్‌కు చెందిన మహిళా అరెస్ట్

**విజయవాడ ఉగ్రకుట్ర కేసులో హైదరాబాద్‌లో సయిదా బేగం అరెస్ట్!**

**ఇన్ స్టాగ్రామ్ గ్రూపుల ద్వారా నెట్‌వర్క్.. పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలపై అధికారుల ఆరా.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, వెబ్ డెస్క్:**
ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో విజయవాడలో నగరంలోని వించిపేట లో కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టి.. ఉగ్రవాద గ్రూపులకు సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్న ముగ్గురు యువకులు మహమ్మద్ రహమతుల్లా, డానిష్, సొహైల్ బేగ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్న అధికారులు విచారించారు. ఈ క్రమంలో ఈ ఉగ్రకుట్రలు హైదరాబాద్ కు పాకాయి. లిదీంతో అప్రమత్తం అయిన కౌంటర్ ఇంటెలిజెన్స్‌లి అధికారులు సయిదా బేగం అనే మహిళను అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను టూటౌన్ పీఎస్ లో సయిదాబేగంను విచారిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ఉగ్ర లింకుల కేసులో సయిదా బేగం కీ రోల్ పోషించినట్లు అధికారులు గుర్తించారు. ఇదిలా ఉంటే 2025 జూన్ లో గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయడం తో అప్రమత్తం అయిన సయిదా బేగం అండ్ టీమ్.. పోలీసులకు తమపై ఎటువంటి అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో "అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్" పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో సోహైల్ బేగ్, షరీఫ్, డానిష్ తో పాటు 12 మంది ఈ గ్రూప్ లో ఉన్నారు. వెస్ట్ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీలో కార్యకలాపాలను నిర్వహించేందుకు ఈ గ్యాంగ్ సిద్ధమైనట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఈ గ్రూపులో మిగిలిన సభ్యులు అయిన బీహార్ వాసి దిల్కాష్ సహా మిగిలిన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా ఈ ఉగ్ర కార్యకలాపాలకు సంబంధించిన కేసు వివరాలు తెలియాల్సి ఉంది.





## దుల్కర్ సల్మాన్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన శృతి హాసన్

వెండితెరపై స్టార్ కిడ్స్‌గా అడుగుపెట్టిన శృతి హాసన్, దుల్కర్ సల్మాన్ తమకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. మరోవైపు, వీరి మధ్య చిన్నప్పటి నుంచే ఒక వింతైన స్నేహం ఉందన్న విషయం తాజాగా బయటపడింది. వీరిద్దరూ చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి... దుల్కర్‌తో తనకున్న స్పెషల్ మెమొరీస్‌ను పంచుకున్నారు.తామిద్దరూ చెన్నైలోని రెండు వేర్వేరు ప్రముఖ పాఠశాలల్లో క్లాస్‌మేట్స్‌గా ఉన్నామని, స్టార్ కిడ్స్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సాధారణంగా పెరిగామని శృతి చెప్పుకొచ్చారు. స్కూల్లో ఉన్నప్పుడు దుల్కర్ తనను 'సోంబి' అని పిలిచి ఆటపట్టించేవాడట. దానికి కారణం.. అప్పట్లో స్కూల్ ఫంక్షన్‌లో శృతి 'సోంబి' అనే పాటను పాడటమే. ఆ పాట విన్నప్పటి నుంచి దుల్కర్‌కు ఆమె పేరు 'సోంబి' అయిపోయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్కూల్లో ఉన్న చాలామంది పిల్లలకు ఆమె పేరు శృతి అని కూడా తెలియదట. కేవలం 'కమల్ హాసన్ కూతురు' అని మాత్రమే గుర్తుంచుకునేవారని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌గా అల్లరి చేసిన ఈ ఇద్దరూ, ఇప్పుడు పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో కలిసి నటించబోతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దుల్కర్ సల్మాన్ సరసన శృతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

## రామ్‌చరణ్ త్వరగా కోలుకోవాలి


'పెద్ది' సినిమా షూటింగ్ సమయంలో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంపై ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. సినిమా చిత్రీకరణ సందర్భంగా రామ్‌చరణ్ గాయపడ్డారని తెలిసిందని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు జనసేన పార్టీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది.రామ్‌చరణ్ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న విడుదల చేయాలని చిత్ర నిర్మాతలు భావిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. చిత్రీకరణ సందర్భంగా రామ్‌చరణ్‌కు స్వల్పగాయమైంది. ఆయన కంటి సమీపంలో చిన్న గాయం అయినట్లు తెలుస్తోంది. చిన్న గాయమేనని, కొన్నిరోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని తెలుస్తోంది. రామ్‌చరణ్ త్వరగా కోలుకోవాలని పలువురు ప్రముఖులు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.





## టీజీపీఎస్సీ అభ్యర్థులకు అలర్ట్...ఎ

## ఓ.టీ.ఆర్ అప్‌డేట్ గడువు పొడిగింపు..!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 25, మెయిన్ డెస్క్:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓ.టీ.ఆర్) వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు అభ్యర్థులకు తుది అవకాశం కల్పించింది. వాస్తవానికి ఈ అప్‌డేట్ గడువు మార్చి 25, 2026 తో ముగియాల్సి ఉంది. అయితే అభ్యర్థుల సౌకర్యార్థం ఈ తుది గడువును ఏప్రిల్ 10, 2026 వరకు పొడిగిస్తూ టీజీపీఎస్సీ సెక్రటరీ అధికారికంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**ఓ.టీ.ఆర్ అప్‌డేట్ ఎందుకు తప్పనిసరి?**

రాబోయే నియామక నోటిఫికేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి, అభ్యర్థుల డేటాలో తప్పులు లేకుండా చూడటానికి, ఫలితాలను త్వరగా ప్రకటించడానికి టీజీపీఎస్సీ ఈ ఓ.టీ.ఆర్ అప్‌డేట్ ప్రక్రియను చేపట్టింది. నిర్ణీత సమయంలోగా ఓ.టీ.ఆర్ అప్‌డేట్ చేసి, సంబంధిత సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసిన వారు మాత్రమే భవిష్యత్తులో టీజీపీఎస్సీ జారీ చేసే ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. కాబట్టి అధికారిక వెబ్‌సైట్ ఞఞఞ.స్త్రజూంఎ.స్త్రశీజ.ఱఅ ద్వారా అభ్యర్థులు తమ వివరాలను తక్షణమే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**అభ్యర్థులు గమనించాల్సిన ముఖ్య నిబంధనలు:**

**పాత అభ్యర్థులకు సూచన:** ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా తమ పాత ఓ.టీ.ఆర్ వివరాలను అప్‌డేట్/ఎడిట్ చేయాలి, సంబంధిత డాక్యుమెంట్లను సూచించిన గడువులోగా అప్‌లోడ్ చేయాలి. పాత అభ్యర్థులు మళ్లీ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతి లేదు.

కఠిన చర్యలు: ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నకిలీ (డూప్లికేట్) అప్లికేషన్లు సృష్టించే ప్రయత్నం చేస్తే.. దానిని డేటా ట్యాంపరింగ్‌గా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటారు.

**కొత్త అభ్యర్థులకు వెసులుబాటు:** మొదటిసారిగా (కొత్తగా) రిజిస్టర్ చేసుకునే అభ్యర్థులకు మాత్రం గడువు ముగిసిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

**అదనపు అర్హతలు ఉంటే:** అదనపు విద్యార్హతలు సాధించిన అభ్యర్థులు, ఆ వివరాలను ఓ.టీ.ఆర్ అప్లికేషన్‌లోని"ఎడిటేబుల్ ట్యాబ్" ద్వారా అప్‌డేట్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

**మళ్లీ గడువు పెంచరు:**

ఏప్రిల్ 10వ తేదీని ఆఖరి అవకాశంగా భావించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించే ప్రసక్తే లేదని కమిషన్ తేల్చి చెప్పింది. ఈ సూచనలు పాటించని వారు రాబోయే నోటిఫికేషన్లకు అనర్హులుగా మిగిలిపోతారని స్పష్టం చేసింది. కాబట్టి అభ్యర్థులు దీనిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని అనర్హత వేటు పడకుండా వెంటనే ఓ.టీ.ఆర్ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది.

## వయసు కాదు కెమిస్ట్రీ ముఖ్యం..



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ తన రాబోయే చిత్రం 'భూత్ బంగ్లా'లో కథానాయిక వామిక గబ్బితో నటిస్తున్న విషయంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. తనకంటే వయసులో చాలా చిన్నవారైన హీరోయిన్లతో రొమాన్స్ చేయడంపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు ఆయన ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. ఈ విమర్శలపై మాట్లాడుతూ.. సినిమాల్లో పాత్రల మధ్య కెమిస్ట్రీనే ప్రధానం తప్ప వయసు కాదని అక్షయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. కథ, దర్శకుడి విజన్ ప్రకారమే నటీనటుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక నటుడిగా విభిన్నమైన పాత్రలు పోషించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని, ప్రేక్షకులు సినిమాను వినోద సాధనంగానే చూడాలని కోరారు.గత కొంతకాలంగా అక్షయ్ కుమార్ తన చిత్రాల్లో తన కంటే 20-30 ఏళ్లు చిన్నవారైన హీరోయిన్లతో నటిస్తున్నారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఇప్పుడు ప్రియదర్శన్ దర్శకత్వంలో వస్తున్న 'భూత్ బంగ్లా'లో కూడా యువ నటి వామిక గబ్బి హీరోయిన్‌గా ఎంపికవడంతో ఈ చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. చాలా కాలం తర్వాత అక్షయ్ కుమార్, ప్రియదర్శన్ కాంబినేషన్‌లో హారర్ కామెడీ జానర్‌లో 'భూత్ బంగ్లా' చిత్రం రాబోతోంది. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ 'భూల్ భులైయా' తరహాలోనే ఈ చిత్రం కూడా ఉండబోతోందని ప్రచారం జరుగుతుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అక్షయ్, వామికతో పాటు ప్రముఖ హాస్యనటులు పరేష్ రావల్, రాజ్ పాల్ యాదవ్ కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.